ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

శనివారం | సెప్టెంబరు 05, 2026 | సంపుటి : 7 | సంచిక : 82 | పేజీలు : 3



## ముకుందా.. ముకుందా..

- ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

3 లో

### కృష్ణా జలాల కేటాయింపుపై

# కుదరని ఏకాభిప్రాయం





## కొనసాగుతున్న ప్రతిష్ఠంభన

- జలసౌధలో కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశం
- ఇవాళ కూడా ఎలాంటి నిర్ణయం తీసుకోని త్రిసభ్య కమిటీ
- బోర్డు పూర్తిస్థాయి సమావేశం నిర్వహించి చర్చించాలని నిర్ణయం

**హైదరాబాద్, ఆయుధం:** కృష్ణా జలాల అంశంపై ప్రతిష్ఠంభన వీడలేదు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పూర్తి స్థాయి బోర్డు సమావేశంలో తేల్చాలని నిర్ణయించారు. రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లోని నీటి నిల్వలపై చర్చించేందుకు హైదరాబాద్ జలసౌధలో జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు.

కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ కాంబోజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు, ఆంధ్రప్రదేశ్ ఈఎన్సీ నరసింహమూర్తితో పాటు రెండు రాష్ట్రాలకు చెందిన ఇంజినీర్లు హాజరయ్యారు. ప్రస్తుత నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, శ్రీశైలం-నాగార్జునసాగర్ జలాశయాల పరిస్థితి, నీటి విడుదలపై సమావేశంలో చర్చ జరిగింది. కృష్ణా జలాల పంపిణీపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మరోసారి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

**వాడీవేడిగా కేఆర్ఎంబీ సమావేశం :**

రెండు రాష్ట్రాలు తమ వాదనలు బలంగా వినిపించడంతో సమావేశాలు వాడివేడిగా సాగింది. పోతిరెడ్డిపాడు, వెలిగొండ సహా ఇతర మార్గాల ద్వారా ఎక్కువ నీటిని తరలించుకుంటున్నారని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. శ్రీశైలం వద్ద తెలంగాణ జలవిద్యుత్ ఉత్పత్తి చేసి దిగువకు నీటిని వాడుకుంటున్నారని ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. నీటి వాటా విషయంలో ఇరు రాష్ట్రాలు తమ తమ వాదనలకే కట్టుబడటంతో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఈ అంశాలను సెప్టెంబర్ నాలుగో వారంలో నిర్వహించే బోర్డు పూర్తి స్థాయి సమావేశంలో విస్తృతంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు.

**పాత నిష్పత్తి సరికాదని వాదన :**

ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి అవసరాల కోసం కృష్ణా జలాలను 50:50 నిష్పత్తిలో పంచాలని తెలంగాణ కోరింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో పాత 66:34 నిష్పత్తిని అమలు చేయడం సరికాదని తెలంగాణ వాదించింది. రాష్ట్ర అవసరాల దృష్ట్యా తెలంగాణకు మొత్తం 200 టీఎంసీల నీరు అవసరమని, అందుకు అనుగుణంగా నీటి కేటాయింపులు చేయాలని కోరినట్లు రమేశ్ బాబు తెలిపారు.

**నిబంధనలకు విరుద్ధంగా నీటి తరలింపు**

66:34 నిష్పత్తిని గత మూడేళ్లుగా తెలంగాణ అంగీకరించడం లేదు. పోతిరెడ్డిపాడు నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ నీటిని తరలిస్తోంది, ప్రస్తుతం వెలిగొండ నుంచి కూడా నీటిని తీసుకుంటోంది. ఈ అంశాలన్నింటినీ సెప్టెంబర్ నాలుగో వారంలో జరిగే కేఆర్ఎంబీ పూర్తి స్థాయి సమావేశంలో సమగ్రంగా చర్చిస్తాం

**- రమేశ్ బాబు, తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్**



### కొండా బర్తరఫ్

# సమంజసమే

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**హనుమకొండ, ఆయుధం:** మంత్రి పదవి నుంచి కొండా సరేఖను ముఖ్యమంత్రి బర్తరఫ్ చేయడం ముమ్మాటికీ సమంజసమేనని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన హనుమకొండలో మీడియాతో మాట్లాడుతూ మంత్రి పదవి అనుభవిస్తూ పార్టీపై పదేపదే విమర్శలు గుప్పిస్తూ, సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే క్రమశిక్షణా చర్యలు కచ్చితంగా ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కొండా సురేఖ చేసిన ఆరోపణలను ఆయన తీవ్ర స్థాయిలో తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందడం లేదని ఆమె ఇప్పుడు ఆరోపించడంపై మండిపడ్డారు. ప్రభుత్వంలో మూడేళ్లుగా మంత్రులుగా కొనసాగిన తర్వాత, ఇప్పుడు పథకాల అమలుపై విమర్శలు చేయడం ఏమిటని, ఇవాళే ఆ సంగతి గుర్తుకు వచ్చిందా అని నిలదీశారు. పార్టీ లైన్ కు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా అధిష్టానం కఠిన చర్యలు తీసుకోవడం సరైనదేనని ఆయన నాయిని రాజేందర్ రెడ్డి సమర్థించారు. కాగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మొదటి నుంచి కొండా సరేఖ వైఖరిని, ముఖ్యమంత్రి పై వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ వస్తున్నారు. కొండా సరేఖ కూతురు కొండా సుస్మిత పటేల్ సిఎం రేవంత్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యల అనంతరం హైదరాబాద్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కొండా సురేఖ వైఖరిని తీవ్రంగా ఖండించారు.

## కొండా సురేఖ తీరు ఆక్షేపణీయం..

- అందుకే చర్యలు: టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



**హైదరాబాద్, ఆయుధం:** కొండా సురేఖ తీరు ఆక్షేపణీయంగా ఉండటంతోనే ఆమెపై కాంగ్రెస్ అధిష్ఠానం చర్యలు తీసుకుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్‌లో ప్రజాస్వామిక స్వేచ్ఛ ఉంటుందని.. అయితే క్రమశిక్షణ విషయంలోనూ పార్టీ అంతే కఠినంగా ఉంటుందని చెప్పారు. దిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. ''కొండా సురేఖ కాంగ్రెస్‌లో కొనసాగుతానని చెప్పారు. పార్టీలో ఉంటే తప్పకుండా అవకాశం ఇస్తాం. గురువారం కొండా సురేఖ ఆవేశం, ఆవేదనతో మాట్లాడారు. ఇకపై అలా మాట్లాడకూడదని సూచిస్తున్నా. పార్టీలో ఎవరికైనా ఇబ్బందులుంటే నేరుగా పీసీసీ అధ్యక్షుడి వద్దకు వచ్చి చెప్పుకోవచ్చు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్, పార్టీ ప్రధాన కార్యదర్శి, అధిష్ఠానాన్ని కలవచ్చు. తమ ఆవేదన వ్యక్తం చేయొచ్చు. అంతేకానీ ఇష్టారాజ్యంగా మాట్లాడితే కాంగ్రెస్ పార్టీ సహించదు. అదే సంకేతాన్ని గురువారం ఇచ్చింది. కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరం.. అయితే ఆమె తీరు ఆక్షేపణీయంగా ఉండటంతోనే అధిష్ఠానం చర్యలు తీసుకుంది. ఏ కాంగ్రెస్ నాయకుడైనా హద్దులు దాటి మాట్లాడితే చర్యలు తప్పవు'' అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.



### మహిళలకు ఇచ్చిన

# హామీలు ఏమయ్యాయి?

- మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి
- కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్య పాలనపై మహిళల వంటావార్పు

**వరంగల్, ఆయుధం:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనచారి, వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో సింహభాగం మహిళలకు సంబంధించిన హామీలే అని గుర్తుచేశారు. మహిళలకు ప్రతి నెలా రూ.2,500 ఆర్థిక సాయం, మహిళలకు పింఛన్లు, ఇతర సంక్షేమ హామీలతో పాటు మహిళలకు అనేక వరాలు ప్రకటించి ఓట్లు దండుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్య పాలనపై వరంగల్ పోచమ్మ మైదాన్ జంక్షన్‌లో మహిళలు వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా, మహిళలకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు రూ.2,500 ఇస్తామన్న హామీ ఏమైందని, మహిళలకు ఇచ్చిన ఇతర హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. హామీల అమలు విషయంలో చేతులు ఎత్తేసి, ప్రచారంలో మాత్రం కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తామంటూ గొప్పలు చెప్పుకోవడం ప్రజలను మభ్యపెట్టడమే అని మండిపడ్డారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రజలు తగిన సమాధానం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని నాయకులు అన్నారు. "ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ఆ హామీలను ఎందుకు అమలు చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలి. మహిళలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానికి మహిళలే తగిన గుణపాఠం చెబుతారు" అని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో మహిళలు, ప్రజల సమస్యలపై మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్తామని సిరికొండ మధుసూదన చారి, నన్నపునేని నరేందర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ అధ్యక్షులు, ఇన్చార్జీలు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

### నేడు కుడా చైర్ పర్సన్

# బాధ్యతల స్వీకరణ



**హనుమకొండ, ఆయుధం:** కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా నియమితులైన గుండు సుధారాణి శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. హనుమకొండలోని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) కార్యాలయంలో కుడా చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి శనివారం ఉదయం 10 గంటలకు పదవీ బాధ్యతల స్వీకరణతో పాటు ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, హనుమకొండ జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులు హాజరుకానున్నారు.



## ఇనుగాలను కలిసిన కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి

**హనుమకొండ, ఆయుధం:** వరంగల్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన గుండు సుధారాణి.. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. హనుమకొండ రామకృష్ణ కాలనీలోని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నివాసానికి వెళ్లిన ఆమె, ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి.. కుడా ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్న గుండు సుధారాణికి శాలువా కప్పి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

### సీఎం రేవంత్ నేతృత్వంలో

# ప్రజారంజక పాలన

- డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి
- మడికొండ జంక్షన్‌లో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన

**హనుమకొండ, ఆయుధం:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా 1000 రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గం, 45వ డివిజన్ పరిధిలోని మడికొండ జంక్షన్‌లో ఘనంగా సంబరాలు నిర్వహించారు. 45వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్ర హరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కర్ర హరీష్ రెడ్డి కలిసి కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గత 1000 రోజులుగా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ విజయవంతంగా ముందుకు సాగుతోందని కొనియాడారు. ప్రజా రంజక పాలన అందిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలను విజయవంతం చేశారు.



# పాడి గేదెల పెంపకంతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- పాడి పరిశ్రమతో ప్రతి కుటుంబానికి అదనపు ఆదాయం
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**పరకాల, ఆయుధం:** పాడి గేదెల పెంపకంతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ఆత్మకూరు, దామెర మండలాలకు 96 యూనిట్స్ పాడి గేదెల మంజూరి పత్రాలను పంపిణీ చేశారు. అంతకుముందు పశువైద్యులు లబ్ధిదారులకు పాడి గేదెల పెంపకం, పశువులకు అందించాల్సిన పోషకాహారం, వ్యాధుల నివారణ, టీకాలు, వాతావరణ మార్పుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దళిత కుటుంబాల ఆర్థిక స్వావలంబన, జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు.



మహిళా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. పరకాల ఇందిరా మహిళా డైరీ ద్వారా రాబోయే 2 సంవత్సరాలలో దాదాపు 40వేల కుటుంబాలకు ప్రతి ఇంటికి 2 గేదెలను అందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.పాడి గేదెల పెంపకం ద్వారా పేద కుటుంబాలు స్వయం ఉపాధిని పొందుతూ తమ కుటుంబ ఆర్థిక ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఆత్మకూరు మండలం కు 72 యూనిట్స్, దామెర మండలానికి 24 యూనిట్స్ ప్రొసీడింగ్స్ పత్రాలను పంపిణీ చేశామని,యూనిట్ కాస్ట్ 2లక్షలు అని, దీనిలో సబ్సిడీ 1లక్ష 60 వేలు,బ్యాంక్ లోన్ 40 వేలు ఇస్తున్నామని అన్నారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా పశువులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉన్నందున, పాడి రైతులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పశువులకు సకాలంలో టీకాలు, వైద్య పరీక్షలు, పోషకాహారం అందిస్తూ ఆరోగ్యంగా పెంచితే పాల ఉత్పత్తి పెరిగి కుటుంబాలకు మరింత ఆదాయం లభిస్తుందని అన్నారు.



## గుండు సుధారాణికి పద్మశాలి సంఘం నాయకుల శుభాకాంక్షలు

**వరంగల్, ఆయుధం:** వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు డాక్టర్ లయన్ ఆడెపు రవీందర్ ఆధ్వర్యంలో కుడా చైర్మన్ గుండు సుధారాణిని పద్మశాలి సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. బీసీ నాయకురాలు, పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన గుండు సుధారాణి ప్రభాకర్ కుడా చైర్మన్ పదవి లభించిన సందర్భంగా పద్మశాలి సంఘం నాయకులు ఆమెను కలిసి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. లయన్ డాక్టరు ఆడెపు రవీందర్ మాట్లాడుతూ, పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన గుండు సుధారాణికి చైర్మన్ పదవి దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆమె తన పదవిని సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు, ముఖ్యంగా బీసీ మరియు పద్మశాలి వర్గాల అభివృద్ధికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండు ప్రభాకర్ వడ్నాల నరేందర్, పట్టణ అధ్యక్షులు డి.ఎస్. మూర్తి, యువజన సంఘం అధ్యక్షులు బేతి అశోక్ బాబు, జిల్లా కార్యదర్శి గోరంట్ల రాజు, ఏకబ్రం, గుండు రవి, భద్రయ్య తదితర పద్మశాలి సంఘం నాయకులు పాల్గొని గుండు సుధారాణికి శుభాకాంక్షలు తెలిపారు. గుండు సుధారాణి నాయకత్వంలో పద్మశాలి సమాజానికి మరింత గుర్తింపు, అభివృద్ధి, సంక్షేమం సాధించాలని సంఘ నాయకులు ఆకాంక్షించారు.

### గుండు సుధారాణికి శుభాకాంక్షలు



**వరంగల్, ఆయుధం**: కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ ( కుడా) చైర్ పర్సన్ గా నియమితులైన గుండు సుధారాణిని తెలంగాణ బిసి బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రతాపగిరి విజయకుమార్ వరంగల్ లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుండు సుధారాణి గత కొన్ని సంవత్సరాలు గా వివిధ రాజకీయ పార్టీలలో పలు పదవులలో పని చేసిన అనుభవం సీనియర్ మహిళా నాయకురాలు గా కాకుండా కార్పొరేటర్ గా, రాజ్యసభ సభ్యురాలుగా, వరంగల్ నగర మేయర్ గా, స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంకొరకు తన వంతుగా కృషి చేస్తూ తాను పనిచేస్తున్న పార్టీని నమ్ముకొని ఉన్న వారిని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి గుర్తించి బిసి మహిళా గా అవకాశం కల్పించినందుకు ధన్యవాదములు తెలియచేస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అవునూరి రామూర్తి కుమ్మర శాలి వాహన తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహానికి స్థలం కేటాయించండి

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డికి ప్రజా సంఘాల వినతి

**హనుమకొండ, ఆయుధం:** హన్మకొండ జిల్లా కేంద్రంలో ప్రజాయుద్ధ నౌక గద్దరన్న విగ్రహం ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని కోరుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ కు ప్రజా సంఘాల నాయకులు ఇచ్చిన వినతిపత్రాన్ని వెంటనే ఎమ్మెల్యే ఫార్వర్డ్ చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ఏర్పాటులో గద్దరన్న పాత్ర కీలకమైందని అలాంటి గద్దరన్న ఆశయ సాధనలో భాగంగా ఆయన విగ్రహాలను రాష్ట్రమంతా ఏర్పాటు చేసుకొని పీడిత ప్రజల విముక్తిలో భాగస్వాములు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గద్దర్ విగ్రహ స్థాపన కమిటి చైర్మన్ కోండ్ర నర్సింగరావు, బిసి జాక్ నాయకులు డాక్టర్ తిరునహరి శేషు, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, డి బి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్, గజాల గోవర్ధన్, గద్దర్ సాంబయ్య, పి. రమేష్ పాల్గొన్నారు.




## ఏఐటీయూసీ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలి

**వరంగల్, ఆయుధం:** ఈనెల 6, 7, 8 తేదీల్లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగే AITUC రాష్ట్ర 4వ మహాసభలకు వరంగల్ జిల్లా నుంచి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా గౌరవ అధ్యక్షుడు పనాస ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం కందిక చెన్నకేశవులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ మహాసభలు ఎంతో ప్రత్యేకమైనవని అన్నారు. కేంద్రంలోని బీజేపీ, మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులు, కార్పొరేట్ యజమానుల ఆస్తులను పెంచేందుకు కుట్రలు చేస్తూ, కార్మికులు 100 సంవత్సరాలకు పైగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికుల హక్కులను కాలరాస్తూ, వారిని బానిస యుగంలోకి తీసుకెళ్లే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్మికులు అప్రమత్తమై, కరీంనగర్‌లో జరిగే AITUC రాష్ట్ర 4వ మహాసభలకు వరంగల్ జిల్లాలోని అన్ని మండలాల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. AITUC వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడుతూ.. ఈ మహాసభల్లో అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు, కార్మికులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. కార్మికుల హక్కుల సాధన కోసం మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కానున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ గుంపెల్లి మునిశ్వర్, గుండె బద్రి, ఎండి.యాకోబ్, గోవర్ధన్, తాళ్లపల్లి జాన్ పాల్, ఉప్పుల రవి, బోట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- కాంగ్రెస్ దగా పాలనపై బీఆర్ఎస్ నిరసన
- పరకాల అంబేద్కర్ సెంటర్లో వంటావార్పు
- రోడ్డుపైనే మహిళలతో భోజనం చేసిన చల్లా
- మహిళలు, వృద్ధులు, విద్యార్థులకు తీరని అన్యాయం
- పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**పరకాల, ఆయుధం:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. 1000 రోజుల కాంగ్రెస్ దగా పాలనకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పరకాల అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన వంటావార్పు కార్యక్రమానికి మహిళలు, వృద్ధులు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రోడ్డుపైనే పొయ్యిలు వెలిగించి వంటలు చేసి మహిళలతో కలిసి మాజీ ఎమ్మెల్యే భోజనం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కొక్కటిగా ప్రజలకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద ఇస్తామన్న తులం బంగారం ఎక్కడుందని ప్రశ్నించారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు అండగా నిలిచిన ఈ పథకాలను నిర్వీర్యం చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పటికీ ఆ హామీని అమలు చేయలేదన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని గొప్పలు చెప్పుకుంటూ.. మరోవైపు పురుషులపై చార్జీల భారం పెంచి కుటుంబాల్లోనే పంచాయతీలు పెట్టే పరిస్థితి తీసుకొచ్చారని చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. మహిళల రక్షణకు పటిష్టమైన భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. ఆ హామీని కూడా పట్టించుకోవడం లేదన్నారు. మహిళా సంఘాలకు పక్కా భవనాలు నిర్మిస్తామని చెప్పి ఆ హామీని పక్కన పెట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో మహిళా సంఘాలకు నిర్మించిన భవనాలే నేటికీ కనిపిస్తున్నాయని, మహిళా సంఘాల సభ్యులను అడిగితే ఎవరు వారి కోసం పనిచేశారో చెబుతారని అన్నారు. మహిళా కమిషన్‌ను బలోపేతం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మహిళల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా కమీషన్ల వసూళ్లకే ప్రాధాన్యత ఇస్తోందని చల్లా ధర్మారెడ్డి ఘాటుగా విమర్శించారు.

కేసీఆర్ కిట్‌ను మాయం చేసి గర్భిణీలు, బాలింతలకు అందాల్సిన భరోసాను దూరం చేశారని, మహిళలకు రూ.2,500 ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. విద్యార్థినులకు ఇస్తామన్న స్కూటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వృద్ధులకు కేసీఆర్ ప్రభుత్వం అందించిన పెన్షన్లే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేసిందేముందని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, పేదల సంక్షేమాన్ని విస్మరిస్తే ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వానికి గుర్తుచేస్తూ.. ప్రజల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు.

## ఇందిరా మహిళా డెయిరీ నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



**దామెర, ఆయుధం:** దామెర మండల కేంద్రంలో నిర్మిస్తున్న పరకాల ఇందిరా మహిళా డెయిరీ నిర్మాణ పనులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. డెయిరీ నిర్మాణానికి సంబంధించిన ప్రణాళిక, స్థల పరిస్థితులు, రహదారి సౌకర్యం తదితర అంశాలను అధికారులతో కలిసి పరిశీలించి, పలు సూచనలు చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. రైతులకు పాడి పరిశ్రమ ద్వారా అదనపు ఆదాయ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా డెయిరీని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. డెయిరీ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

## వైభవోపేతంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

- అలరించిన చిన్నారుల వేషధారణలు, నృత్యాలు, గీతాలాపన, కోలాటాలు..



**జనగామ, ఆయుధం:** శ్రీ కృష్ణ జన్మాష్టమి, విశ్వహిందూ పరిషత్ స్థాపన దివస్ పురస్కరించుకొని జనగామ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో అత్యంత వైభవోపేతంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి, స్థాపన దివస్ వేడుకలు నిర్వహించారు. సాంప్రదాయ బద్ధమైన శ్రీ కృష్ణ ఆరాధనతో ప్రారంభమై, గీతా పారాయణ, వక్త సందేశం, చిన్నారులతో రాధా కృష్ణుల వేషధారణ పోటీలు, గీతాలాపనలు నిర్వహించారు. చిన్నారులు రాధకృష్ణుల వేషధారణలో, పలువురు భగవద్గీత శ్లోకాలు, పాటలు, కీర్తనలు, కథలతో అలరించారు. శోభాయమానంగా పండగవాతావరణంలో చిన్నారులందరూ కలిసి నృత్యాలు చేసారు. ప్రదర్శనలో ఆకర్షణీయంగా నిలిచిన పలువురు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విభాగ్ సంఘటన మంత్రి శివరాములు పాల్గొని మాట్లాడుతూ కృష్ణుడు జగద్గురువుగా మహత్తర గీతోపదేశం చేసి, మానవాళికి ధర్మసూత్రాలను బోధించారని, దుష్ట శిక్షణ శిష్ట రక్షణ, ధర్మసంస్థాపన కోసం అవతరించిన నారాయణుడు మహాభారతాన్ని నడిపించాడని, కృష్ణుడి ఆరాధన మాత్రమే కాదు ఆయన చూపిన ధర్మమార్గంలో యువత నడవాలని, ధర్మ రక్షణ కోసం ముందు నిలవాలని అన్నారు. ధర్మ పరిరక్షణ కోసమే విశ్వహిందూ పరిషత్ స్థాపించబడిందని సమస్త సాధుసంతువులు స్వామీజీలు పీఠాధిపతులు మఠాధిపతులు హిందూ మేధావులు గురువు ఆచార్యులు యావత్ దేశ ప్రముఖులందరూ విశ్వహిందూ పరిషత్ సభ్యులే అని తెలిపారు. ప్రతీ గ్రామంలో పరిషత్ విస్తరించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎనగందుల బిక్షపతి, కార్యదర్శి మోహనకృష్ణ భార్గవ, ఉపాధ్యక్షులు పాశం శ్రీశైలం, బాలనారాయణ, కుందారపు బైరునాథ్, యెలసాని కృష్ణమూర్తి, తాడూరి సంతోష్, ఉల్లెంగుల రాజు, హర్షవర్ధన్, సాయితేజ, గొడిశాల శివరామ్, రవి, శ్రీనివాస్ మరియు చిన్నారులు, తల్లిదండ్రులు, దేవాలయ కమిటీ సభ్యులు, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దల్, మాతృమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.






## ప్రయాగ్ విద్యాపీట్ లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**హనుమకొండ, ఆయుధం:** హనుమకొండ జవహర్ కాలనీ లో గల ప్రయాగ విద్యాపీట్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు గోపికలు శ్రీకృష్ణుడి వేషాధరణలో అలరించారు. వెన్నదొంగ శ్రీకృష్ణుడు ఉట్టి కొడుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ప్రవళిక రెడ్డి మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడు గోవర్ధనగిరి పర్వతాన్ని ఎత్తి ప్రజలను, గోవులను రక్షించారని పిల్లలు ఒకరికి ఒకరు సాయం చేసుకుంటూ ప్రేమతో మెలగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వరంగల్‌లో యువకుడి హనీ ట్రాప్

- సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను మోసం చేసి రూ.14.75 లక్షలు కాజేసిన నిందితుడు
- నిందితుడిని అరెస్టు చేసిన వరంగల్ పోలీసులు

**వరంగల్, ఆయుధం:** హనీ ట్రాప్ సైబర్ మోసానికి పాల్పడిన నిందితుడిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, వరంగల్ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్, వరంగల్ పోలీసులు తమిళనాడు రాష్ట్రంలోని సేలంకు చెందిన సెల్లముత్తు మనికంధన్ ను అరెస్ట్ చేశారు. వరంగల్‌లో నమోదైన కేసులో వరంగల్‌కు చెందిన తుమ్మ ఉదయ్ కిరణ్ (32), సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడు Y99 వెబ్‌సైట్ ద్వారా 'లావణ్య' అనే మహిళగా నటిస్తూ బాధితుడితో పరిచయం ఏర్పరచుకున్నట్లు గుర్తించారు. అనంతరం బాధితుడితో సన్నిహితంగా మెలుగుతూ అతని నమ్మకాన్ని పొందాడు. తరువాత అత్యవసర అవసరాలు, విద్య, పరిశోధన ఖర్చులు, వైద్య అవసరాలు, వ్యక్తిగత అవసరాలు తదితర కారణాలను చూపుతూ బాధితుడిపై భావోద్వేగపూరిత ఒత్తిడి తీసుకువచ్చి పలుమార్లు డబ్బులు బదిలీ చేయించుకున్నాడు. వివిధ బ్యాంకు ఖాతాలు, యూపీఐ (UPI) లావాదేవీల ద్వారా బాధితుడి నుంచి మొత్తం రూ.14,75,100/ మోసం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. సాంకేతిక, ఆర్థిక ఆధారాల ఆధారంగా నిందితుడిని గుర్తించిన సైబర్ క్రైమ్ పోలీసుల ప్రత్యేక బృందం తమిళనాడు రాష్ట్రంలోని సేలం జిల్లాలో నిందితుడిని అరెస్ట్ చేసి, కోర్టు ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించింది. ఈ కేసులో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బి. శివకృష్ణ, దినేష్, భరత్, జహూర్ మొహమ్మద్ ప్రత్యేక దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్‌లో పరిచయమయ్యే వ్యక్తులను పూర్తిగా నమ్మి వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు లేదా ఆర్థిక సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియా, డేటింగ్ మరియు చాటింగ్ యాప్‌ల ద్వారా పరిచయమయ్యే వ్యక్తులు డబ్బులు అడిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైనట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్కు కాల్ చేయాలని లేదా cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.

## మహిళా జర్నలిస్టులపై దాడిని ఖండిస్తున్నాం

- ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ



**వరంగల్, ఆయుధం;** మహిళా జర్నలిస్టులు షాహీన్ ఖాన్, నఫీసా ఖాన్ ఢిల్లీలో ముఖ్యమంత్రి రేఖా గుప్తా కార్యక్రమాన్ని కవర్ చేస్తున్న మహిళా జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసుల దాడి దాడిని అఖిల భారత యువజన సమాఖ్య తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం జాతీయ కార్యదర్శి, తెలంగాణ అధ్యక్షుడు డా.సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ పేర్కొన్నారు. ''ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే ఇటువంటి సంఘటనలు అత్యంత ఆందోళనకరం. వార్తలను సేకరించడం, ప్రజలకు నిజాలను తెలియజేయడం జర్నలిస్టుల రాజ్యాంగబద్ధమైన హక్కు. విధి నిర్వహణలో ఉన్న మహిళా జర్నలిస్టులపై దౌర్జన్యానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.'' అని కోరారు. ఈ ఘటనపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ చేపట్టాలి. బాధ్యులైన ఢిల్లీ పోలీసు సిబ్బందిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి. మహిళా జర్నలిస్టులకు భద్రత కల్పించి, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలి. ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు ప్రజలకు సమాధానం చెప్పాలి. మహిళా జర్నలిస్టులు షాహీన్ ఖాన్, నఫీసా ఖాన్‌లకు ఏఐవైఎఫ్ సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తూ, వారికి న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులను డిమాండ్ చేశారు.



## నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో సీఎం రేవంత్ పర్యటన

**హైదరాబాద్, ఆయుధం:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో పర్యటించారు. నారాయణపేట జిల్లా మద్దూరులో ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల పనులను సీఎం పరిశీలించారు. పాఠశాల నిర్మాణ ప్రణాళికలను పరిశీలించి ప్రాంగణమంతా కలియతిరిగి అధికారులకు పలు సూచనలు చేశారు. భూమిలిచ్చిన రైతులతో మాట్లాడారు. ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి వారి నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఆ తర్వాత వికారాబాద్ జిల్లా హకీంపేట చేరుకున్న సీఎం.. విద్యా హబ్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

## కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి తీసుకోం

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



**హైదరాబాద్, ఆయుధం:** పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో కొందరు తిరిగి బీఆర్ఎస్ లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని.. వారిలో ఒకరిద్దరు మినహా ఎవరినీ తీసుకోబోమని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. మీడియాతో ఆయన చిట్ చాట్ నిర్వహించారు. మాజీ మంత్రి కొండా సురేఖ అంశంపైనా జగదీశ్‌రెడ్డి స్పందించారు. ''పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లోకి తీసుకునేది లేదని చాలా మంది నేతలకు ఇప్పటికే చెప్పాం. కొండా సురేఖను కూడా పార్టీలోకి తీసుకోం. బీఆర్ఎస్‌లోకి వచ్చేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దరఖాస్తు చేసినా ఆయన్ను తీసుకునేది లేదు. ఎన్నికలకు ముందు కోమటిరెడ్డి సోదరులు బీఆర్ఎస్‌లోకి వస్తామంటే పార్టీ తిరస్కరించింది. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే డబ్బులకు అమ్ముడుపోయినట్టే. ఆరోపణలు చేసింది కొండా సురేఖ కాదు.. ఆమె కుమార్తె. గతంలో రాజగోపాల్‌రెడ్డితో పాటు చాలా మంది నేతలు నేరుగా పార్టీపై ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌లను తప్పుబట్టారు'' అని జగదీశ్‌రెడ్డి అన్నారు.














# ముకుందా.. ముకుందా..

## అంగరంగ వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- రాంనగర్ నుండి కాళోజీ కళాక్షేత్రం వరకు శ్రీకృష్ణుడి రథయాత్ర
- భారీగా తరలివచ్చిన భక్తులు, యాదవులు
- కిక్కిరిసిన కళాక్షేత్రం
- వేడుకలకు హాజరైన మండలి ప్రతి పక్ష నేత సిరికొండ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ లో యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు సంగంరెడ్డి సుందర్ రాజ్ ఆధ్వర్యంలో కాళోజీ కళాక్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఏర్పాట్లు చేశారు. హన్మకొండ రాం నగర్ నుండి కాళోజి కళాక్షేత్రం వరకు శ్రీకృష్ణుడి రథయాత్ర డప్పు కళాకారులు, డీజే పాటలతో హుషారుగా సాగింది. భారీ రథయాత్రను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం కాళోజీ కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమం ఆహుతులను ఉర్రూతలూగించింది. గొల్ల-కురుమల విశ్వాసాలు, సాంప్రదాయాలను కళాకారులు ప్రదర్శించారు. కళా ప్రదర్శనలను తిలకించేందుకు వచ్చిన వారితో కళాక్షేత్రం ఆవరణ కిక్కిరిసిపోయింది. కార్యక్రమానికి వచ్చిన వారికోసం నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. వేడుకలకు బీఆర్ఎస్ శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసుదానాచారి, ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి హాజరయ్యారు.















Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695